క్లుప్తంగా

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయుడు సురేష్‌ను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

చిన్నకోడూరు(సిద్దిపేట): రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన రామంచ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు సురేష్‌కుమార్, చిన్నకోడూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్‌రెడ్డిని శనివారం నిజామాబాద్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొన్నారు.

కక్షిదారులు రాజీపడితే స్వాగతిస్తాం

- జడ్జి శివరంజని



రాజీ కేసులను పరిష్కరిస్తున్న జడ్జి శివరంజని

హుస్నాబాద్: కక్షిదారులు క్షణికావేశంలో చేసిన తప్పులకు రాజీపడితే కోర్టు స్వాగతిస్తుందని ప్రిన్సిపాల్ సివిల్‌కోర్టు జూనియర్ జడ్జి శివరంజని అన్నారు. హుస్నాబాద్ పట్టణంలోని కోర్టుహాల్‌లో శనివారం లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ కోర్టు పరిధిలో వివిధ రకాల 3వేల కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ప్రతిరోజు పరిమితికి మించి కేసులు వస్తుండటంతో కేసులను తగ్గించేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టులు రాజీ కుదుర్చుకునే కేసులను రాజీమార్గం ద్వారా సత్వరమే పరిష్కరించుకునేందుకు లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కక్షిదారులకు లోక్‌అదాలత్‌పై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు సివిల్ జడ్జి కృష్ణతేజ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చిత్తారి రవీందర్, ఏజీపీ కన్నోజు రామకృష్ణ, ఏపీపీ రవికిరణ్, న్యాయవాదులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తలకే బీసీ బంధు

తొగుట(దుబ్బాక): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బీసీ బంధు దుబ్బాక నియోజకవర్గంలో పక్కదారి పడుతోందని కాంగ్రెస్ నాయకులు ఆరోపించారు. శనివారం మండల కేంద్రంలో ఐఎన్‌టీయూసీ దుబ్బాక ఇన్‌చార్జ్ బాలమల్లు మాట్లాడుతూ.. అర్హులైన పేదలకు కాకుండా బీఆర్‌ఎస్ కార్యకర్తలకు అందించింది అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని విమర్శించారు. పేదలకు చేరాల్సిన పథకాలను ప్రజా ప్రతినిధులు, నాయకులు కాజేస్తున్నారని మండిపడ్డారు. వీటిని అడ్డుకోకపోతే కాంగ్రెస్ ఆ. ద్వర్యంలో ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. పీఏసీఎస్ డైరెక్టర్ మహిపాల్‌రెడ్డి, నాయకులు నర్సింలు, మ ల్లేశం, దామోదర్, అన్వార్, అఖిల్‌పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను పర్మినెంట్ చేయాలి



గోడపత్రిక ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

దుబ్బాక: అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేసి, రూ.26వేలు కనీస వేతనం చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 11వ తేదీ నుంచి చేపట్టనున్న సమ్మె పోస్టర్‌ను శనివారం దుబ్బాక పట్టణంలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు 70 వేల మంది అంగన్‌వాడీలు పని చేస్తున్నారని, వారికి కనీస వేతనం, ఉద్యోగ భద్రత కల్పించక పోవడం బాధకరమన్నారు. ప్రభుత్వం స్పందించి వారి డిమాండ్లను నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు నాగరాణి, పద్మ, విజయ, పుష్ప, భూలక్ష్మీ, తదితరులున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

దౌల్తాబాద్(దుబ్బాక): మండలంలోని గాజుపల్లి గ్రామానికి చెందిన మార్కంటి రవికి రూ.26 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును శనివారం పంజాస్వామి అందజేశారు. కార్యక్రమంలో పాశం యేసు, కొత్త నర్సింలు, గొల్లపల్లి రాజు, దాసరి స్వామి, యాదగిరి, గొల్లపల్లి నర్సింలు, పంజా రాజారాములు, బొల్లి లచ్చయ్య, కనకరెడ్డి, మహంకాళి అంజయ్య, దాసరిసత్తయ్య, పోకల సుధాకర్, దశరథం తదితరులు పాల్గొన్నారు.



కల్యాణం.. కమనీయం

మర్కూక్(గజ్వేల్): మండలంలోని గణేశ్‌పల్లిలో లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రావణ మాసం ఉత్సవాల్లో భాగంగా శనివారం స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. ఉదయం స్వామివారిని ముస్తాబు చేసి పెళ్లి పందిరి వేసి పందిట్లో స్వామివారికి వేద పండితుల మంత్రోచ్చరణాలు, సన్నాయి చప్పుళ్ల మధ్య వైభవంగా నిర్వహించారు. జెడ్పీటీసీ మంగమ్మ రాంచంద్రం, సర్పంచ్ మంజుల శ్రీరాములు దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు తీసుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం స్వామివారి రథోత్సవాన్ని ఊరేగించారు. కార్యక్రమంలో అర్చకులు మోహన్, ఎంపీటీసీ నరేందర్, ఉప సర్పంచ్ మహేశ్ పాల్గొన్నారు.

నాణ్యతలేని నిర్మాణాలు

- సీపీఎం మండల కార్యదర్శి సత్తిరెడ్డి



బండ గుట్టపై నిర్మిస్తున్న 55 గదుల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కొమురవెల్లి(సిద్దిపేట): బండగుట్టపై నిర్మిస్తున్న 55 గదులు నాణ్యతా ప్రమాణాలు లేకుండా నిర్మాణం చేపడుతున్నారని సీపీఎం మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి ఆరోపించారు. శనివారం పార్టీ నాయకులతో కలసి గదుల నిర్మాణ సముదాయన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లన్న ఆలయ చైర్మన్ కమీషన్లకు కక్కుర్తి పడటంతోనే ఈ పరిస్థితి దాపురించిందని ఆరోపించారు. దేవాలయం వద్ద నీతి నిజాయితీతో పని చేయాల్సిన చైర్మన్ ఆలయంలో చేపడుతున్న ప్రతి పనిలో కమీషన్లు తీసుకోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. దీంతో సదరు కాంట్రాక్టర్లు నిర్మాణాలను నాణ్యత లేకుండా చేపడుతున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో రాంసాగర్ సర్పంచ్ రవీందర్, జిల్లా కమిటీ సభ్యులు కృష్ణారెడ్డి, నాయకులు ఇస్తారి, యాదయ్య, కృపాకర్, శ్రీనివాస్, శ్రవణాచారి, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

హుస్నాబాద్: సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. పట్టణంలోని పోచమ్మవాడలో శనివారం సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ బొజు రమా, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న రజిత

సత్రం వద్ద లోపించిన పారిశుద్ధ్యం

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి నిత్యాన్నదాన సత్రం వద్ద పారిశుద్ధ్యం లోపించింది. దీంతో సత్రంలోకి దుర్వాసన రావడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారు. సత్రంలోని వివిధ అవసరాలకు వాడిన నీటిని డ్రైనేజీలోకి కాకుండా పక్క గల్లీలోకి వదులుతున్నారు. దీంతో బురద గుంటలు ఏర్పడడంతో పందులు వీర విహారం చేయడంతో దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో భక్తులకు, పరిసరా ప్రాంతాల్లో ఉండే వారికి అనేక వ్యాధులు వచ్చే ప్రమాదం లేకపోలేదు. వెంటనే ఆలయ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు.

గొర్రెల పంపిణీ

బెజ్జంకి (సిద్దిపేట): మండల పరిధిలోని దేవక్కపల్లెలో శనివారం పలువురు లబ్ధిదారులకు ఎంపీపీ లింగాల నిర్మల జెడ్పీటీసీ కవితతో కలిసి గొర్రెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం గొల్ల, కురుమల ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు ఒంటెల సంపత్‌రెడ్డి, పశు వైద్యాధికారి శ్రీకాంత్‌రెడ్డి, ఫాక్స్ వైస్‌చైర్మన్ బండి నమేష్, రావుల రామక్రిష్ణారెడ్డి, ప్రసాద్‌రావు, రమేష్ పాల్గొన్నారు.

ఎల్‌ఓసీ అందజేత

తొగుట(దుబ్బాక): సీఎం కేసీఆర్ పేద కుటుంబాలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగంచేసుకోవాలని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని వెంకట్రావుపేటకు చెందిన మిద్దె ప్రతాప్‌కు ఆస్పత్రి ఖర్చుల నిమిత్తం మంజూరైన రూ 2.50లక్షల ఎల్‌ఓసీ పత్రాలను శనివారం అందజేశారు. మెదడుకు సంబంధించిన ఆపరేషన్ కోసం ప్రతాప్ ఇబ్బంది పడుతుండగా, విషయాన్ని ఏఎంసీ మాజీ డైరెక్టర్ రమేష్‌గౌడ్ ఎంపీ దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన ఎంపీ ప్రభాకర్ రెడ్డి ఎల్‌ఓసీ అందించి అండగా నిలిచారు.

టికెట్ ఫ్లీజ్

ప్రశాంత్‌నగర్ (సిద్దిపేట): సిద్దిపేట నియోజకవర్గ బీజేపీ అసెంబ్లీ అభ్యర్థులుగా తమకు అవకాశం ఇవ్వాలని కోరుతూ హైదరాబాద్‌లోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో జిల్లాకు చెందిన ఆ పార్టీ నాయకులు శనివారం దరఖాస్తులు చేసుకున్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షులు దూది శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు విద్యాసాగర్ దరఖాస్తులు చేసుకున్న వారిలో ఉన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యుత్ షాక్‌తో పాడి గేదె మృతి చెందిన ఘటన మండలంలోని గురువన్నపేట గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు. గ్రామానికి చెందిన తేలు చంద్రం తన గేదెను మేత కోసం తీసుకెళ్లాడు. ఈ క్రమంలో ట్రాన్స్‌ఫార్మర్ వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందింది. దీనివిలువ సుమారు 60వేల వరకు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు కోరాడు.

మద్యం మత్తులో యువత చిత్తు లఘు చిత్రం

చేర్యాల(సిద్దిపేట): మద్యం మత్తులో యువత ప్రాణాలు కోల్పోతున్న అంశంపై చేర్యాల పోలీస్‌ల సహకారంతో ఓరుగంటి (బొట్టు) శంకర్ నిర్మాణ సారథ్యంలో లఘు చిత్రం షూటింగ్ శనివారం పట్టణ కేంద్రంలో జరిగింది. సిద్దిపేట మూవీస్ యూట్యూబ్ చానల్ ద్వారా చిత్రీకరిస్తున్న ఈ చిత్రంలో 'మద్యం మత్తులో యువత చిత్తు' అంశాన్ని ప్రధానంగా చూపిస్తున్నట్లు చిత్రం యూనిట్ తెలిపింది. మైనర్లు వాహనాలు నడపడం, ట్రిపుల్ రైడింగ్, మద్యం, గంజాయిమత్తులో యువత జీవితాలను చిన్నాభిన్నం చేసుకోవద్దని, సన్మార్గంలో నడవాలనే ఉద్దేశంతో సినిమా తీస్తున్నట్లు దర్శక నిర్మాతలు తెలిపారు. షూటింగ్‌కు సహకరించిన చేర్యాల పోలీస్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. షూటింగ్‌లో డైరెక్టర్ లింగంపల్లి నవీన్, నటులు అందె అశోక్, అంబటి అంజయ్య, అంబాల శ్రీనివాస్, దర్శనం రాహుల్, ఎండీ అక్బర్, సుజాత, సింగపాక మనోజ్, తిగుల్ల రాకేష్, అందె కిరణ్, కెమెరామెన్‌లు కందుకూరి సాత్విక్, వల్లూరి విజయ్, పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో నెమలి మృతి

అక్కన్నపేట(హుస్నాబాద్): అనుమానస్పద స్థితిలో జాతీయ పక్షి నెమలి మృతి చెందింది. ఈ సంఘటన అక్కన్నపేట మండలం కేశవాపూర్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు. గ్రామ శివారులోని ఓ మామిడితోటలో నెమలి మృతిచెంది ఉండటాన్ని గ్రామస్తులు, రైతులు గుర్తించారు. అటవీశాఖ అధికారులకు సమాచారమిచ్చినా ఎవరూ స్పందించలేదు.

కాళోజీ చిరస్మరణీయుడు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జనం గొడవను తన గొడవగా మలుచుకొని జీవితాంతం జనం కోసం నిలబడిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు చిరస్మరణీయుడని వెన్నెల సాహితీ సంగమం సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు వంగర నరసింహారెడ్డి అన్నారు. కాళోజీ జయంతిని శనివారం పట్టణంలో వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వంగర నరసింహారెడ్డి మాట్లాడుతూ కాళోజి జీవితాన్ని కవులు, రచయితలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కవులు పర్కపెల్లి యాదగిరి, కొండి మల్లారెడ్డి, మహమూద్ భాషా, త్రివిక్రమ శర్మ, శ్రీధర్, పిన్నింటి మహేందర్, కాల్వ రాజయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాళోజీని స్ఫూర్తిగా తీసుకోవాలి

జిల్లా వ్యాప్తంగా శనివారం కాళోజీ నారాయణరావు జయంతిని జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పలువురు మాట్లాడుతూ..



నివాళులర్పిస్తున్న యూత్ ప్రతినిధులు

తెలంగాణ యాసను నిజమైన భాషగా నినదించిన ప్రజాకవి కాళోజీ ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.

యువతకు కాళోజి స్ఫూర్తి

చేర్యాల(సిద్దిపేట): యువత కాళోజి స్ఫూర్తితో ముందుకు సాగాలని మండలంలోని కడవేర్గు గ్రామ కాళోజి యూత్ అధ్యక్షుడు ఆరుట్ల కిషన్ అన్నారు. శనివారం గ్రామ కూడలి వద్ద కాళోజి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధి ఆరుట్ల లింగం తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయండి

- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

దుబ్బాక: పట్టణంలో రూ.17 కోట్ల నిధులతో నిర్మిస్తున్న ఐఓసీ భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం నిర్మాణ పనులు ఆమె పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. భవనం ఆవరణలో చెట్లు నాటాలని, అవసరమైన సామగ్రిని త్వరగా ఏర్పాటు చేసుకోవాలన్నారు. తహసీల్దార్, అటవీ, ఉద్యానవన, తదితర ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయంత్, మున్సిపల్ కమిషనర్ గణేష్ రెడ్డి, డిప్యూటీ తహసీల్దార్ సందీప్, పీఆర్ ఏఈ రిజ్వాన్, తదితరులున్నారు.

పురస్కారాలతో మరింత ఉత్సాహం

సిద్దిపేటకమాన్: పెందోట బాల సాహిత్య పురస్కారాలు, పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పురస్కార గ్రహీతలు మాట్లాడుతూ పురస్కారాలు కవులు, రచయితలను ఉత్సాహపరుస్తాయని తెలిపారు. అనంతరం మేలుకొలుపు, బాల సాహిత్య సృజనకారుల పరిచయం, మానవ చిగురులు, సాహసవీరుడు పుస్తకాలను వారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు కవులు, రచయితలు చినరామకృష్ణ, పరశురాములు, శైలజ, సుధాకర్, గంగాధర్, విశ్వనాథం, శ్రీలత, చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు, బాల కవులు తదితరులు పాల్గొన్నారు.



పురస్కారాలు అందుకున్న కవులు, రచయితలు

హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలి

హుస్నాబాద్‌రూరల్: గిరిజన హక్కుల కోసం సేవాలాల్ సేన 9 ఏళ్ల నుంచి ఉద్యమిస్తోందని కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు నాగరాజు నాయక్ అన్నారు. శనివారం భల్లునాయక్ తండాలో సంఘం జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మారుమూల గిరిజన ప్రాంతాలకు రవాణా సౌకర్యాలు లేక గిరిజనులు వెనుకబడి పోతున్నారన్నారు. తెలంగాణలో ఈ తండాలను ప్రత్యేక పంచాయతీలుగా ఏర్పాటు చేసి మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలన్నారు. రోడ్ల నిర్మాణాలు చేపట్టి బస్సు సౌకర్యం కల్పిస్తే పంటలను పట్టణాలకు తీసుకెళ్లి విక్రయించుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సంఘాలన్నీ ఒకే వేదికను ఏర్పాటు చేసుకుని హక్కుల కోసం ఐక్యపోరాటాలు చేయాలన్నారు. కార్యక్రమంలో రాజనాయక్, శంకర్‌నాయక్, గోవర్ధన్ నాయక్, తిరుపతి, సునీల్, చిన్ననాయక్, సంగీతా, అనిత, స్వప్న పాల్గొన్నారు.



జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

బీజేపీకి పెరుగుతున్న ఆదరణ

సిద్దిపేటరూరల్: బీజేపీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని, వచ్చే ఎన్నికల్లో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం నారాయణరావుపేట మండలం గోపులాపూర్‌లో బీఆర్‌ఎస్‌కు చెందిన పలువురు నాయకులు బీజేపీలో చేరారు. గ్రామానికి చెందిన 50 మందికి కండువా కప్పి బీజేపిలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ.. సిద్దిపేటలో కాషాయం జెండా ఎగరడం ఖాయమన్నారు.



బోనమెత్తిన గాగ్గిల్లాపూర్

మండలంలోని గాగ్గిల్లాపూర్‌లో రెండు రోజులుగా జరుగుతున్న బొడ్రాయి, పోచమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా శనివారం గ్రామస్తులు గ్రామదేవతలకు బోనాలు సమర్పించారు. తెల్లవారుజాము విగ్రహాలకు పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మధ్యాహ్నం మహంకాళమ్మ, సాయంత్రం బీరప్ప, పెద్దమ్మ, మాతమ్మలకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. జనాలు పెద్ద ఎత్తున తరలిరావడంతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది.

- మద్దూరు(హుస్నాబాద్)

సంక్షిప్త వార్తలు

అర్హులకు డబుల్ రూమ్‌లు ఇవ్వాలి

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూమ్‌లను కేటాయించాలని, లేనిపక్షంలో ఈనెల 11న మున్సిపల్ కార్యాలయం ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సందబోయిన ఎల్లయ్య డిమాండ్ చేశారు. శనివారం గజ్వేల్‌లో ఆయన మాట్లాడుతూ.. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో గత ప్రభుత్వం ఇచ్చిన పట్టా సర్టిఫికెట్ రద్దు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం.. 5వేల మందికి డబుల్ ఇళ్లు కట్టిస్తామని హామీ ఇచ్చి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. 3 దఫాలుగా సర్వే చేయించి ఏళ్లు గడుస్తుందన్నారు. కార్యక్రమంలో నర్సింలు, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల ఆశయ సాధనకు కృషి

గజ్వేల్‌రూరల్: దళితులు ఐక్యంగా ఉండి మహనీయుల ఆశయ సాధనకు కృషి చేయాలని అంబేడ్కర్ సంఘం నాయకులు తాడెం పెద్ద యాదగిరి, డాకని భిక్షపతి పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్‌లోగల 3వ వార్డులోని అంబేడ్కర్ భవనంలో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహనీయుల విగ్రహ ఏర్పాటుకు కమిటీని ఎన్నుకున్నారు. సభ్యులుగా పర్శరాములు, భిక్షపతి, సల్ల శ్రీనివాస్, రాయపోల్ పర్శరాములు, బాబు, సాయిలు, స్వామి, వెంకటేశం, ఎల్లం, రాంచంద్రం, ప్రభు, ఎల్లేష్, నాగార్జున, నరేష్, మహేందర్, దుర్గయ్య, దత్తయ్య, ప్రసాద్, బాలయ్య, యాదగిరి, రవిలను ఎన్నుకున్నారు.

విద్యుత్ వైర్ల చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): విద్యుత్ వైర్లను చోరీ చేసిన ఘటన మండలంలోని లెనిన్‌నగర్‌లో శనివారం చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ శివారులోని ములుగు యాదగిరి, మిట్టపల్లి నారాయణరెడ్డితో పాటు మరో రైతుకు చెందిన బోరు బావుల వద్ద శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు స్టార్టర్ బాక్స్ నుంచి బోరు బావి వరకు గల కేబుల్ వైర్ దొంగిలించినట్లు తెలిపారు. ఒక్కో రైతుకు రూ.5 వేల నుంచి 10 వేల వరకు నష్టం వాటిల్లినట్లు తెలిపారు. దీనిపై ఎస్‌ఐ నాగరాజును వివరణ కోరగా ఫిర్యాదు చేయలేదన్నారు.

వ్యక్తి అదృశ్యం

రాయపోలు(దుబ్బాక): ఇంట్లో గొడవపడి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన రాయపోలు మండలం రాంసాగర్‌లో చోటుచేసుకుంది. ఎస్‌ఐ రఘుపతి వివరాల ప్రకారం.. రాంసాగర్ గ్రామానికి చెందిన సంకటి సత్తయ్య (45) శుక్రవారం రాత్రి మద్యం సేవించి ఇంటికి వచ్చాడు. భార్య కనకవ్వతో గొడవపడని అనంతరం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తెలిసిన వారు, కుటుంబ సభ్యుల వద్ద వెతికినా ఆచూకీ లభించకపోవడంతో భార్య కనకవ్వ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీటీ రోడ్డును మంజూరు చేయాలి

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని మల్లంపల్లి గ్రామం నుంచి తాళ్లతండా మీదుగా కట్కూర్ వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి వెంటనే నిధులు మంజూరు చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి, తాళ్లతండాకు చెందిన గుగులోతు తిరుపతినాయక్ కోరారు. శనివారం గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి విన్నవించినట్లు తెలిపారు. చినుకు పడితే చిత్తడిగా మారే రోడ్డుపై ప్రయాణం చేయాలంటే అవస్థలు పడుతున్నామన్నారు. 6 కిలోమీటర్ల వరకు ఉన్న రూటులో అడుగుకొక గుంత ఏర్పడి నరకయాతన పడుతున్నామన్నారు. ఈ మార్గం గుండా ఐదారు గ్రామాల ప్రజలు కట్కూర్‌లో ఉన్న తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌కు వెళ్తుంటారని చెప్పారు. 60 ఏళ్ల బీటీ రోడ్డు నిర్మాణ కలను నెరవేర్చాలని కోరినట్లు పేర్కొన్నారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తూ నిధులు మంజూరుకు కృషి చేస్తానని చెప్పారన్నారు.

చొరబాట్లపై ఫిర్యాదు

కొమురవెల్లి(సిద్దిపేట): తన స్థలంలోకి అక్రమంగా ప్రవేశించారని పలువురిపై ఫిర్యాదు చేసిన ఘటన కొమురవెల్లిలో శనివారం జరిగింది. శనివారం ఎస్‌ఐ నాగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రసులాబాద్‌లోని సర్వే నంబర్ 213లో అక్రమంగా కొంత మంది ప్రవేశించి కడీలు పాతారని ఐనాపూర్ మాజీ సర్పంచ్ వేములవాడ ప్రమీలతోపాటు పలువురిపై నర్సింహాచారి ఫిర్యాదు చేశారు.

పాదయాత్రను విజయవంతం చేద్దాం

గజ్వేల్‌రూరల్: రైతు, ఉపాధి కూలీలు, నిరుద్యోగులు, గ్రామాల్లోని సామాజిక పరిస్థితులను తెలుసుకునేందుకు నిర్వహించ తలపెట్టిన సామాజిక పరివర్తన పాదయాత్రను విజయవంతం చేయాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఏగొండస్వామి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దుబ్బాక నియోజకవర్గంలోని రాయపోల్ మండలం బేగంపేట గ్రామంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి ఈ యాత్ర ప్రారంభమవుతుందన్నారు. దీనిని సీనియర్ జర్నలిస్టు మల్లేపల్లి లక్ష్మయ్య ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీబీఎఫ్ నాయకులు వేణు తదితరులున్నారు.

మండలకేంద్రానికి 108 అంబులెన్స్ కేటాయింపు

అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల కేంద్రంలో 108 అంబులెన్స్ అందుబాటులోకి వచ్చింది. హాట్స్పాట్‌లో భాగంగా రోజు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. అయితే హుస్నాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలో రెండుండగా అందులో ఒకటి ఇక్కడ ఉండేలా వైద్యాధికారులు కేటాయించారు. మండలంలో పల్లెలు, మారుమూల గ్రామాలు, గిరిజన తండాలు ఎక్కువగా ఉంటాయి. దీంతో ప్రమాదాలు, ఆత్మహత్యలు తదితర సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

చేర్యాల(సిద్దిపేట): పట్టణ పరిధిలోని 12వ వార్డుకు చెందిన శనిగారి బాలయ్య భార్య శనిగారి అంజమ్మ అనారోగ్యంతో బాధపడుతూ శనివారం ఉదయం మృతి చెందింది. విషయం తెలుసుకున్న కౌన్సిలర్ పచ్చిమడ్ల సతీష్‌గౌడ్ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చి కొంత ఆర్థిక సాయం చేశారు. నాయకులు ఉన్నారు.

11న గురుపూజోత్సవం

సిద్దిపేటకమాన్: జిల్లా ప్రైవేట్ పాఠశాలల ఆధ్వర్యంలో సిద్దిపేటలోని పత్తి మార్కెట్ యార్డ్‌లో ఈనెల 11వ తేదీన గురుపూజోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శనివారం సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొంటారన్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరుకానున్నట్లు తెలిపారు. ప్రస్తుత సమాజంలో ఉపాధ్యాయులకు తగిన గౌరవం ఇవ్వాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రవి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం, మంత్రి చిత్రపటాలకు క్షీరాభిషేకం

చిన్నకోడూరు (సిద్దిపేట): మండల పరిధిలోని విఠలాపూర్ డబుల్ రోడ్డు నిర్మాణానికి రూ.12.50 కోట్లు నిధులు మంజూరు చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు చిత్రపటాలకు శనివారం క్షీరాభిషేకం చేశారు. వైస్ ఎంపీపీ పాపయ్య, సర్పంచ్ నవీన్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కాముని శ్రీనివాస్, ఎంపీటీసీ సునీతాసాగర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ శనివారం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రావణమాస చివరి శనివారం సందర్భంగా పట్టణంలోని వైష్ణవ ఆలయాలతో పాటుగా శైవ ఆలయాల్లో భక్తులు ఘనంగా పూజలు నిర్వహించారు. మోహినిపుర శ్రీ వెంకటేశ్వర ఆలయం, పాత వెంకటేశ్వర ఆలయం, శ్రీరామ ఆలయం, శ్రీ పంచముఖ వీరాంజనేయ స్వామి ఆలయాలలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాలలో కొలువైన మూలవిరాట్‌లను పూలు, పండ్లతో అలంకరించారు.

మంత్రి చొరవతో టిఫిన్ బాక్స్‌ల అందజేత

సిద్దిపేటరూరల్: నారాయణరావుపేట మండల పరిధిలోని గుర్రాలగొందిలోని 450మంది ఉపాధి కూలీలకు టిఫిన్ బాక్స్‌ల అందజేత కార్యక్రమం నిర్వహించారు. మంత్రి హరీశ్‌రావు చొరవతో వీటిని అందించడం సంతోషంగా ఉందని సర్పంచ్ శాతరాజుపల్లి ఆంజనేయులు అన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ హరీశ్, స్థానిక నాయకులు ఉన్నారు.